రాత్రించరులు

'భాను'

1

నిశాకాంతబంధుర వినీలకుంతలాలఛాయ రోదసీకుహరాంతరంలో వ్యాపించి స్థావరజంగమ ప్రకృతిని క్రమ్మ గలి తెరగా మారిపోయింది.

నల్లని ఆకాశంలో పలుచనిమబ్బులు పిరికివాడి ఆలోచనలా అలిబిల్లిగా క్రమ్ముకొన్నాయి. మొయిలు పయ్యెదలలో మసకబడిన నక్షత్రాలకాంతి లత్తుక చుక్కలకాంతిలా ఉంది. ఆకులను చలింపజేయలేని పిల్లవాయువులు వీస్తున్నాయి. ప్రకృతి స్తంభించింది.

కామంలాంటి చీకటి; పాపంలాంటి చీకటి; కటిక చీకటి మానవజీవితపు చరమరంగస్థలంలో భయానకంగా నర్తిస్తున్నది. హృదయంలో భయాన్ని పెంచే ప్రళయవాతావరణం.

శిఖల్లాగా నిలబడ్డ గుబురు వెదురుచెట్లు. వివిధాకారాలతో భయంగొలిపే రెల్లుగడ్డిదుబ్బులు. విశృంఖలంగా ఊళలువేస్తున్న సృగాల సరాగాలు. ఎఱ్ఱని కన్నుల్లో కసి తిరుగుతున్న తోడేళ్లగుంపులు. భూమిమీద చుక్కల్లాగా పరిభ్రమిస్తున్న మిణుగురుపురుగుల మందలు—ఇవన్నీ ఒకవైపున ఉన్నాయి.

మాతృగర్భంలో శిశువులాగా కదిలే ప్రక్క ఏటిలోని నీటి నిశ్శబ్దం. ప్రవాహానికి పైన వంగి అడ్డుపడిన గట్టుపైన జామచెట్టుకొమ్మ చేస్తున్న మంజులమైన గలగల సందడి. ఆ నీటిజాలుల గలగలశబ్దంతో గళాలు మేళవించి శ్రుతికలిపి, లయానుగుణంగా తాళాలువేస్తున్న కీచురాళ్లు. రెల్లుగడ్డిదుబ్బులపై స్వైరవిహారం చేస్తున్న మిడతలరెక్కల చప్పుడు. నిద్రపోతున్న నిద్రగన్నేరుచెట్లపైన నిద్దురపోతున్న పక్షుల కలవరింతలు—ఇవన్నీ ఇంకొకవైపున ఉన్నాయి.

ఉద్ధృతంగా జ్వలిస్తున్న కాష్ఠాలలో చితులు. టప్పున పగిలిపోయే కపాలాల చప్పుడులు. మనోవేదనను కలిగించే మాంసపు కవురుకంపు. వెంట్రుకలు కమురుకుపోయిన వాసన. నక్కలు కొరుకుతున్న శవాల ఎముకలశబ్దం. వాటి కాళ్ల తాకిడికి కణకణమంటున్న పగిలిన కుండపెంకులు. ఎండుటాకుల మర్మరధ్వనులకు వల్మీకరంధ్రాల్లోనుండి మెరుస్తూ తొంగిచూస్తున్న పడగలువిప్పిన విషకాకోలాలు. తళుక్కుమంటున్న ఆకులతో రావిచెట్టు. దానితొఱ్ఱలోనుండి విద్యున్నేత్రాలతో తీక్ష్ణదృక్కులదివాంధాలు—ఇవన్నీ మరొకవైపు.

స్త్రీల విషపు నవ్వులాగా నవ్వుతున్న కొర్నాసుల యికిలింతలు, ఊడలుదిగిన మఱ్ఱిచెట్టుపైన మాటికి మాటికి అఱుస్తున్న తీతువు పిట్టలు. తుమ్మచెట్లపైనుండి కర్ణాలను ఘూర్ణింపజేస్తున్న రాత్రిఈగల సంగీతం మరుభూమిని మరులుకొలుపుతూ వుంది.

మరొకప్రక్కగా—

జుట్లు విరియబోసుకొని మఱ్ఱిఊడల ఉయ్యాలలూగుతూ, ఘొల్లున నవ్వుతూ, కాళ్ళు ఊపుతున్న నగ్నస్త్రీలు. తమాషాగా చలిస్తున్న అవయవాల పొందిక. హృదయ విదారకంగా రోదిస్తున్న మరికొందరు స్త్రీల ఆర్తనాదాలు. గుంపులు గుంపులుగా కేకలువేస్తున్న పురుషుల ఆకారాలు. జోలలు పాడుతున్న కంఠస్వరాలు. ప్రేమగీతాలు ఆలాపిస్తున్న కొన్ని గొంతుకలు. పల్లకిమోస్తున్న బోయల కేకలు, బట్టలు ఉతుకుతున్న చాకలికేకల వైఖరులు—కిచకిచమంటున్న అవ్యక్తధ్వనులు.

మఱ్ఱిచెట్టు చిటారికొమ్మమీద తెల్లనికోక కట్టుకొన్న వెండిబొమ్మలాంటి యువతి దిక్కులుచూస్తు కూనిరాగం తీస్తున్నది. కొంచెందూరంలో తుమ్మచెట్టు పంగలో ఒక యువకుడు కూర్చొని ఈలపాట పాడుకొంటున్నాడు.

ఘల్లుమనే గజ్జలతో కొందరు నృత్యంచేస్తున్నారు. అక్కడక్కడ మండిపోతున్న చెట్లు మళ్ళీ మామూలు చెట్లవుతున్నాయి. క్షణక్షణం మండుతూ ఆరిపోతున్న అగ్నిజ్వాలలు అక్కడక్కడ కనబడుతున్నాయి.

కాని, ఎవరిముఖాలూ స్పష్టంగా కన్పించడం లేదు.

భీకరమైన కోలాహలం సాగుతోంది. అంతా నిరామయం.

రోదనలు, కేరింతలు, పకపకలు, పసిపిల్లల యేడ్పులు, బండబూతులు.

మంచి మనసులో పాడు ఆలోచనలా వుంది ఆ ప్రాంతం.

నిశ్చలమైన సరసులో సుడిగుండంలా వుంది ఆ ప్రదేశం.

అదొక ప్రత్యేక ప్రపంచం. ఒక ప్రత్యేక వాతావరణం.

అంతలో యెక్కడో అడుగుల సవ్వడి. గాలి దుమారం. పిచ్చిపిచ్చి మాటలు వినిపించాయి. అవసాన కాలంలో వెలువడ్డ భీకరమైన పిచ్చినవ్వు.

ఆ ప్రదేశపు కోలాహలం సమసిపోయింది. నక్కలు రెలుగుబ్బల్లో దాక్కున్నాయి. తోడేళ్ళు గట్టుమీద కుక్షీగా కూర్చున్నాయి. గుడ్లగూబలు భయంకరంగా అరిచాయి. అగుపులకు, విచ్చులకు గొంతులు బిగుసుకుపోయాయి. ఆకారాలు అదృశ్యమైనాయి.

శూన్య గడియలు. కీచురాళ్ళ గళారవాలు. ఆకులు రాలుతున్న సవ్వడు రెండు మూడు గబ్బిలాల రెక్కల విసురు మఱ్ఱిచెట్టు వైపుగా వెళ్లింది.

దారిద్ర్యంలాంటి చీకటి; కాటుకలాంటి చీకటి; మరణంలాంటి చీకటి మరీ దట్టంగా అల్లుకపోయింది.

ఏదో ఆకారం అస్పష్టంగా, వికారంగా, రోగగ్రస్తమైన పశువులాగా పదురు పొదలకు, పురుగు కంపలకు నడుమ కదిలింది.

ఎక్కడో బల్లి అరిచింది. సర్పపు నోట్లో కప్ప బాధతో మూలిగింది.

ఆ ఆకారం నెమ్మదిగా అడుగులు వేస్తున్నది.

సంస్కారశూన్యమైన తల దుబ్బులాగా వుంది. గడ్డం బాగా పెరిగింది. మానాన్ని మాత్రమే సంరక్షించే జీరాడుతున్న జీర్ణ వస్త్రాలు. అసహజమైన దుర్గంధం. తదేకదృష్టితో చూస్తున్న మిణుగురుపురుగుల్లాంటి కనుపాపలు. మాటిమాటికీ తుళ్ళిపడుతున్న శబ్దం మధ్యలో ఏదో గునుస్తున్న గొణుగుడు.

మఱ్ఱిచెట్టుకు దగ్గరగా వచ్చాడు. చేతులు ఆడిస్తూ నడుస్తున్నాడు. ఏవో బిగ్గరగా కేకలు. ఒక ఎత్తైనగట్టు లాంటి ప్రదేశంమీద కూర్చొని కుంప త్రవ్వుతున్న గుంటనక్క. అతని అంగల్లోనుండి పరిగెత్తింది

అతను నవ్వాడు. మనుష్యుల్లా నవ్వలేదు. అదో రకంగా నవ్వాడు పిచ్చిగా నవ్వాడు. అతని నవ్వు విని నక్కలు మోరలెత్తి అరిచాయి అతను వీపుమీద మూటదింపి. ఒక చేతి ఎముకను పట్టుకొని అటు, యిటు పరుగెత్తాడు. కాని ఏమీ కనబడలేదు.

ఆకులు మరింతగా రాలిన శబ్దం. వెదురు ఆకుల మీద జరజరమన్న మోత. సన్నని చినుకులు. విడవబోతున్న ఆకాశం. కొద్దిగా చలిగాలి.

రెలుగుబ్బల చాటున జ్వలిస్తున్న మంటలు. అతను ఆ మంటల దగ్గరగా వెళ్ళాడు. అక్కడ మంటలు లేవు. ఇంకొంచెం దూరంలో మండుతున్నాయి.

వెర్రిగా నవ్వుతూ మంటలదగ్గరకు పరుగెత్తాడు. అవి అక్కడ మాయమైనాయి. అతనిచుట్టూ మంటలు పరివేష్టించాయి మానవాకారాలుగా మార్పుచెందాయి. అవి నోరు విప్పుతూంటే పుష్పాలాగ అగ్నికణాలు రాలుతున్నాయి. వాటి ముఖాలు ముడతలు పడి భయోద్వేగాన్ని కలిగిస్తూ వున్నాయి. అవి పైకి వస్తున్నాయి. ఆ పిచ్చివాడు చలించలేదు.

"ఓసీ...ఓసీ!" అంటు ప్రక్కనవున్న మండుతున్న కాష్ఠాన్ని పట్టుకోగానే బిలబిలమంటు పరుగెత్తాయి.

"హీ...హీ...హీ......కొరివి దెయ్యాలు...నన్నేం...చేస్తాయ్యి...మోసం" వికృతంగా నవ్వుకొని తృప్తిపడ్డాడు.

నెమ్మదిగా నడిచి మఱ్ఱిచెట్టు మొదలు దగ్గరవున్న రాతి అరుగు మీద చెట్టుకు వీపు ఆన్చి ఆవులిస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళకు చీకటి ఈగలు ముసురుకొన్నాయి. అతని మనస్సు వర్తమానంలోనే లగ్నమైంది. అతన్నిగూర్చి అతనికి ప్రస్తుతంలో ఏమీ తెలియదు. మానవ సహజమైన ఆలోచనా జ్ఞానం లోపించింది.

నిశ్చల నిర్నిమేష దృక్కులతో నిరామయంగా కూర్చున్నాడు.

అంతా చీకటి. అతని తలలో చీకటి. బయట చీకటి.

మరలా గట్లమీద ఆకారాలు మామూలుగా తమ యథాప్రకార కార్యక్రమాన్ని సాగిస్తున్నాయి. అతనికి ఎదురుగా జ్వలిస్తున్న చితులు. మండుతున్న మంటలు. అతను ఎదటి ప్రదేశాన్ని మాత్రమే చూస్తున్నాడు.

2

అతని ఎదురుగా ఒక ఆకారం కదిలింది. మెడ ఎత్తి చూడాలని ప్రయత్నం చేసేలోగా—క్షణంలో ఆకారంపు ఛాయ అతనిపై పడింది. శరీరం బండబారిపోయింది. సర్వాంగాలు మొద్దుబారిపోయాయి. విప్పారిన కళ్లు అలానే వున్నాయి. మత్తులాంటి అవస్థ; మగతలాంటి స్థితి ఆవరించింది. హృదయంపై వహించలేని భారం పెట్టినట్టనిపించింది. ఏ అవయవం చలిద్దామన్నా అశక్తతగావుంది.

ఒక్క నిమిషం గడిచింది.

చలిగాలిలో వణికినట్టు అరిచాడు. కాళ్ళు చేతులు కొట్టుకొన్నాడు. చెట్టు పైన దృష్టి సారించాడు చిటారి కొమ్మమీద తెల్లకోక మనిషి; వెండి బొమ్మలాంటి ఆకారం కనబడింది. అతనికి పరిచయమైన ముఖం లాగా కనబడింది. ప్రక్కన ఉయ్యాల

లాగుతున్న నగ్న యువతుల ఆకారాలు. సుందరంగా, సుకుమారంగా, మెల్లిగా ప్రాణాలు తోడేస్తున్నట్టుగా చలిస్తున్నాయి వారి ఉన్నత వక్షోజాలు. అతను చేతులు నలుముకొన్నాడు. గాలిలోని ప్రమిద చలించి వళ్లు హృదయంలో ఒక భాగం భయపడింది. ఆదృశ్యం చూడ్డానికి దగ్గరగా వెళ్లాడు. మరీదగ్గరగా వెళ్లాడు పట్టుకోబోయాడు. ఊగుతున్న ఊడలు. రాలుతున్న ఆకులు. అంతే! ఇంకేమి కనబడలేదు. మళ్ళా గుండె అలిసిపోయింది. శరీరం స్పర్శశక్తిని కోల్పోయింది. కన్నులు చూస్తున్నాయి. ఏదృశ్యం గాని వస్తువు గాని చెట్టు చేమ గాని. కన్పించడం లేదు. తల దిమ్మెక్కింది. అతని ముందు ఆకారాల ఛాయలు. వెనుక కొన్ని ఆకారాల నీడలు. అతను నడుస్తున్నాడు. వలయాకారంగా తిరుగుతున్నాడు. వీపు మీది మూట భుజాన్నుండి జారింది. అతను గుబ్బలు, గట్లు దాటి నడుస్తున్నాడు. నడుస్తూ, నడుస్తూ ఒక్క చోట చట్టున ఆగిపోయాడు.

శరీరం తేలికయ్యింది. కళ్ళు చూడగల్గుతున్నాయి ఎదురుగా తుమ్మచెట్టు తుమ్మపూలవాసన. అతను బండ బూతులు తిట్టాడు. కాళ్ళల్లో ముళ్ళబాధ కలుక్కుమంది. వంగి తీసుకోబోయాడు. వెనుక నవ్వుతున్న కిచకిచ ధ్వనులు. వెనుతిరిగాడు. రోషంతో. చీకటి కడుపులో మరగిపోయిన నిశ్చల ప్రకృతి. ఇంకేం కనబడలేదు.

ముందు తుమ్మచెట్టు పంగలో ఈలపాట. అతను ముందుకు తిరిగాడు. తుమ్మచెట్టుపంగలో మానవాకారం. క్రమేణా స్థాయి హెచ్చవుతున్న ఈలపాట. నిద్రాముద్రితమైన ప్రకృతికి జోలపాట పాడుతున్న కీచురాళ్ళ కంఠాలు ఈలపాటలో శ్రుతికలిపాయి. తీతువుపిట్ట విశృతగానం లయగా సాగుతోంది. ఏవో పక్షుల రెక్కల విసురులు గాలికి శబ్దం చేస్తున్న మంటలు.

చెప్పడానికి వీలులేని ప్రకృతి; వ్రాయడానికి వీలులేని ప్రకృతి, వికారం లాంటి ప్రకృతి, అజ్ఞానం లాంటి ప్రకృతి.

అతను ఈలపాట వింటున్నాడు. మునుపు విన్నటనిపించింది. పాలోచనగా వింటున్నాడు. మెదడులో మెరుపు మెరిసింది. పిచ్చిగా నవ్వాడు. కసిగా నవ్వాడు. అదోరకంగా నవ్వాడు.

“వాడిదే యీపాట...!...హు హూఁ... వాడిదే...అవును...అదే. ఈడకెందు కొచ్చాడబ్బా. ఏమోలే...హహ్హాఁ.... అవును లే ...అటువంటోళ్ళు... ఎక్కడ కొస్తారు...మరి?...ఇప్పుడిక్కడి కెందు కొచ్చాడు...యదవ నాయాలు...వాడికేం అధికార ముంది?...ఇదంతా మంది” హీ హీ హీ అంటు నవ్వాడు.

ఈలపాట ఆగలేదు. పై పెచ్చు హెచ్చు పాయి లోకి వెళ్ళింది. రకరకాల ప్రాణుల కంఠస్వరాలు సమ్మిశ్రితమైనాయి. ఈలపాట సాగుతూనే వుంది అతనిలో కోపం పెల్లుబికింది. కోపాన్ని ఆపుకోలేక పోయాడు.

“ఎవ్వడ్రా నువ్వు...?...ఆపు...ఏవిటిపాట” ఆవేశంగా అన్నాడు.

“నవ్వాపమనడానికి నీకేం అధికారముంది?” స్పష్టమైన ప్రతి వచనం వచ్చింది.

“...రేయి! నాకే ఎదురు సెప్తావ్రటా... చంపేసా! తెలుసా...!హా హా హా” అంటు నవ్వాడు.

“ఏ జీవికి రెండుసార్లు మరణం లేదు తెలుసా?” సున్నితమైన నవ్వు, నిష్కళంకమైన నవ్వు, హాయి అయిన నవ్వు విన్పించింది.

అతను చేతిలోని కాష్ఠాన్ని బలంగా ఆకారం వైపు విసిరాడు. అది ఆకారం దగరకు వెళ్ళి తగిలింది. ‘ఫన్’ మని శబ్దం. ఆక్షణంలో ఆకారం అక్కడ లేదు. అతను ఆశ్చర్యపడి. దగ్గరకు వెళ్ళాడు. వెనక మళ్ళీ అదే యీలపాట. అదే స్థాయి. అతను వెనక్కు తిరిగాడు. తాటిబొంద ప్రక్కన కాళ్ళుసాచికూర్చున్నదా ఆకారం. అతను చెంగుమని అక్కడకు దూకాడు. వట్టి నేల. మోకాళ్ళ చిప్పలు కొట్టుకపోయాయి. మళ్ళా వెనుక పూర్వస్థలంలో అదేపాట, అదే ఆకారం. చేతిలో మూట బలంగా విసిరాడు. ఆ ఆకారం కదలేదు. నెమ్మదిగా దగ్గరకు వెళ్ళాడు. ఆకారం రెండు మూడు అడుగులదూరంలో వుంది. తూర్పున మెరుపు మెరసింది. ఆ ఆకారం ముఖం స్పష్టంగా కనపడింది. అతను వెనుకంజ వేశాడు. చిన్నపిల్లవాడిలా భయపడ్డాడు.

‘ఆ ... సు ... దర్శనం ...’ తలగోక్కుంటు పిచ్చిగా జ్ఞాపకం తెచ్చుకొన్నట్లు అన్నాడు.

‘జ్ఞాపకానికి వచ్చానా? మారి...’ దీనంగా ధ్వనించాడు మాటలు.

మారి మాట్లాడలేదు. పిచ్చిగా నవ్వుతున్నాడు. రెప్పలు మాటిమాటికి ఆల్లలార్చాడు. దగరపడ్డ మూట తీసుకునుంచున్నాడు. పాచిపట్టిన సరసులాంటి మనసులో మటి బెడ్డలాంటి విషయం చొచ్చి కొద్దిగా స్వచ్ఛతను కనుపరుపజేసింది. మారి ఛటాలున వెనుతిరిగి నడక ప్రారంభించాడు. ఎదురుగా సుదర్శనం ఆకారం.

‘ఛీ...అడ్డంలే’ ఛీత్కారంగా అన్నాడు.

‘ఇంకెక్కడికి వెళ్ళగలవూ?’ నవ్వుతూ సుదర్శనం ఆకారం అంది.

‘ఏం?...’ పెదవులు కొరుక్కుంటూ అన్నాడు.

‘ఆహా ... ఏమీ ... లేదు. ఇక్కడకు వచ్చి నోళ్ళు అక్కడకు వెళ్లరులే; అందుకని’ చిలిపి సమాధానం.

‘నీవంటి దౌర్భాగ్యుడు ... మిత్రద్రోహి ... సరిగా చెప్పాడని చేసుకోనులే’ అన్నాడు సూరి. అతని మనసులో గతస్మృతులు మెదిలాయి.

‘అవును; ఇద్దరం అంతే. నీ దృష్టిలో నేను, లోకందృష్టిలో నువ్వు’ కలకలమని నవ్వుతూ అన్నాడు.

సూరి పగలబడి నవ్వాడు. ఆ నవ్వుకు నిశ్శబ్దం ప్రతిధ్వనించింది. ఆకాశం ఉరిమింది.

‘అవును; ఇద్దరం అంతే వాళ్ళూ యిట్లాగే అన్నారు. ఇట్లాగే...అన్నారు’ అని మౌనంగా వూరుకొన్నాడు.

‘సూరీ! మాట...’ ప్రాధేయపూర్వకమైన కంఠం.

‘ఏహ్! యీ ప్రపంచకంలో మనం ఎవ్వరి మాటయినా నమ్మాలా. నిన్ను నమ్మాం....బోల్తా కొట్టాం. ఇక ఎవరిమాట వినం’ పెరిగిన మీసాల మధ్య చెయ్యి వేసుకొన్నాడు సూరి. నెమ్మదిగా నడవడానికి ప్రయత్నిస్తున్నాడు. సుదర్శనం ఆకారం ప్రక్కగా నడుస్తున్నది.

‘సూరీ! నన్నెందో అపార్థం చేసుకొన్నావు. నా జీవితాన్ని భగ్నంచేశావు. అమానుషంగా చేశావు ...నాతో ... ఒక్కమాట ... ఒక్కమాట ... అనకుండా నన్ను యీ గతికి...దుర్భరమైన యీ స్థితికి ...ఈ నిశ్శబ్దపు బందిఖానాలోకి...ఈ చీకటిలోకపు పొలిమేరలలోకి...ప్రవేశపెట్టావు...ఎందుకు? ఎందుకు చేశావా రాక్షసకృత్యం?...ఎందుకు చేశావా దారుణ కృత్యం’ సుదర్శనం ఆకారం వాపోయింది.

శిథిలమై, క్షీణమై, శక్తిహీనమైన సూరి పిచ్చి మేధా కూడుకోడానికి ప్రయత్నిస్తున్నటుగా వుంది. హృదయంలో మంటకు చలనం కలిగింది. మెదడు లోపల ఏదో బాధ ఉపశమిస్తున్నట్లుంది. ఏవో సరిక్రొత్త భావనలు.

‘నీ కడుపులో ఏదో అనుమాన ముండి చేశావు గదు సూరీ? ఇలాగ కన్యను అటు మానవుణ్ణి కాకుండ—ఇటు జంతువును కాకుండా నికృష్టమైన, దుస్సహమైన ... యీ జీవితంతో గడుపుతున్నాను. ప్రకాశించే దీపాన్ని ఆర్పినట్లు, వికసించని పువ్వును తుంపినట్లు, పాడుతున్న కంఠాన్ని నులిమినట్లు, కన్నబిడ్డను చంపినట్లు నా జీవితాన్ని నమ్ముచేశావు. ఈ స్థితి ఎటువంటిదో తెలుసా? ఏడవడానికి కన్నీళ్లు రావు. అనుభూతికి ఆకలింతలు రావు. ఆనందం ఊహకి అందదు. మధురమైన స్వప్నాలు రావు. మాట్లాడానికి నోరురాదు. హృదయంతో మాటాడాలి. చివరి సమయపు సంఘటనలే ఈ స్థితిలో జ్ఞాపకం వుంటాయి’ సుదర్శనం ఆకారం ద్రవించేటట్లు మాట్లాడింది.

గాఢనిద్రలో మేల్కొని నిద్రించే స్థితిగా, జ్ఞప్తికి తెచ్చుకొంటున్న పసిపాప మనసులాగా, గ్రుడ్డి నయనాలు దృష్టిని పొంది అపూర్వమైన సౌందర్యాన్ని వీక్షిస్తున్నటున్న స్థితిగా సూరి మనస్సు భ్రమిస్తున్నది.

వాళ్ళిద్దరూ తిరుగుతున్నది కటులాంటి ప్రదేశంలో. నక్కలు పరుగెత్తుతున్న చప్పుడు. మిడతలు లేస్తున్న విసుర్లు. కీచురాళ్ళ యీలలు మంద్రస్థాయిలో వున్నాయి. తెరలు తెరలుగా శబ్దం వినవస్తూవుంది.

‘సూరీ! మనం సన్నిహితులం... స్నేహితులం. కంటిరెప్పల్లాగా జీవించాం. కల్లో కూడ మనకు అభిప్రాయభేదాలు రాలేదు. మంచి చెడు కలసే చేశాం. జీవితాన్ని గురించి చర్చించుకొన్నాం. మనం జీవితంలో పరస్పరం విడిపోకూడదని తీర్మానించుకొన్నాం. కాని అంతా తల్లక్రిందులైంది. ఎందుకు అమానుషంగా ఘోరంగా అలాచేశావ్? ఎందుకుచేశావ్ సూరీ? నా ప్రాణంలాంటి స్నేహితుడిచేతిలో అట్లా అవసానం స్వర్గంకన్న అధికమైందే! కానీ... ఒకటి... నాకు జరిగిన కార్యం... ఏ కారణంవల్ల సంప్రాప్తమైందో నాకు తెలియకుండా జరిగింది అదే నాకు...యిప్పటి వరకు అశాంతి... ప్రసవవేదనలాంటి అవస. అందుకే యిలా అయ్యాను. ఎందుకు చేశావ్ సూరీ? కారణం చెప్పవూ? తాపమైన హృదయానికి కొంచెం తృప్తి కలిగించవూ?’ సుదర్శనం ఆకారం బొంగురుకంఠం దీనంగా ప్రార్థించింది.

సూరి మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనల్లో ఒక ఆలోచనాతరంగం బుద్ధికి గమ్యమైంది. ఒక అసహ్యమైన, వికారమైన నవ్వు నవ్వాడు.

‘అవును! ఆమలను నాకు కాకుండా చెయ్యాలనుకొన్నావు అందుకే నిన్ను క్రూరంగా చంపాను. అందుకే...చంపాను...అందుకే చంపాను’ సునాయాసంగా అన్నాడు.

‘ఎవరన్నారు...ఆమాట?’ గాలి వేగంతో ప్రశ్న.

మళ్ళీ అదేనవ్వు. ‘లోకం...కం...లోకంఅంది కాదు; చూసినోళ్ళు అన్నారు. నేను లేనప్పుడు నువ్వు అమలదగర ఎలా ప్రవర్తించింది? ఏం మాట్లాడింది? అంతా నాకుతెలుసు. పిల్లి పాలు తాగుతూ ఎవ్వరూ చూడడం లేదు అనుకొన్నట్లు అనుకొన్నావు.’

"కాదు; అబద్ధం. పూర్తి అబద్ధం. నీ అపోహ నా మరణానికి ఎలా కారణమైందో యిప్పుడు తెలుసుకో గల్గుతున్నాను. సూరీ! నేను సత్యం చెపుతున్నాను. నిజంగా నాకేమి తెలియదు. నేనిప్పుడు లోకపు పరిధిలో లేను. మామూలు లోకంలో అబద్ధానికి జీవితానికి సామరస్యంవుంది. అబద్ధమే జీవితం అంటే అతిశయోక్తి కాదేమో?! కానీ... యిప్పుడు...యిక్కడ ఆపరిస్థితికి పూర్తి వ్యతిరేకం. జరిగిన విషయాలు అసత్యాలైనా, యథార్థాలైనా అవసరం వస్తే విధిగా చెప్పాలి. కాబట్టి నేను నిజాన్ని దాచుకున్నానని భ్రమపడనక్కరలేదు. అసలు విషయం చెపుతున్నాను. నాకు ఆమెకు...సోదరవాత్సల్యం తప్పితే మరేలాంటి సంబంధం లేదు. మనం... మొట్టమొదట ఆమెను చూశాం. మీరిద్దరు పరస్పరం చూసుకొన్నారు. ఆమె నీతో జీవితంలో భాగస్వామిగా వచ్చింది. అప్పటినుండి లోకంలో నేనున్నంతవరకు నేను మాత్రం స్వంతసోదరిలాగా చూసుకొన్నాను. కాని యీ విషయం లోకం అనే అర్థంలో తారుమారైంది. ఆఛాయ నీలో పరావర్తనమైంది. సూరీ; అసలు లోకం చెవులకు, కళ్ళకు మనం అనుకొన్న విషయాలు అనుకొన్నట్లుగా వినబడవు అందుకే నువ్వు లోకరీత్యా మనసు లోతుల్లోకి చూడలేకపోయావు. మానవ సహజమైన మానసిక బలహీనతలో సత్యాసత్యాలు గమనించలేకపోయావు. నేను యిప్పుడు అనుకొంటూ వుంటాను, మన సుదీర్ఘమైన పరిచయఫలం ఏమైందా? అని.

"నేననుకొన్నా; నువ్వు తొందరగా ఇక్కడకు వొస్తావని; అవాడైనా నాకెందుకీ పరిస్థితి జరిగిందో తెలుసుకోవాలని అనుకొన్నా. అసలు సంగతి తెలిసింది. నా నిర్దోషత్వం వెలువరించాను. ఏమిటో...నిజంగా నా భారం ... ఏదో ... తగ్గినట్టుంది. అబ్బ...ఎంత హాయిగావుంది సూరీ! ఇక వుండలేను. ఆబులుసుగుట్ట ప్రక్క సమాధి నాది. వస్తా 'సూరీ...నువ్వు సాధ్యమైనంత తొందరగా కలుస్తావనుకొంటాను. భీకరమైన, ప్రచండమైన, భయానకమైన గాలివీచింది సుదర్శనం ఆకారం రెప్పపాటులో మాయమైంది.

సూరి మనస్సు జాగ్రదవస్థనుండి వెలుగులోకి తొంగిచూసింది. ఏదో ఒక ఆలోచన గాలిలోని గుడ్డలాగా చలించింది.

దిక్కులు చూశాడు. భయంలాంటి చీకటి; భారంలాంటి చీకటి; వికారంలాంటి చీకటి; మూగ చీకటి క్రమ్ముకుపోయింది.

'సు...ద...ర్శ...నం' గావు కేక. నిశ్శబ్దపు కడుపులో ప్రతిధ్వనించింది. రాత్రిచరిస్తున్న జీవులన్నీ ఒక్కసారిగా కంఠాలు విప్పాయి

ఆ పిలుపును అందుకొన్నట్టు ప్రక్క యేటిలోని చేప తోకతో నీటినిగిరిచి శబ్దంచేసింది. కప్పలు ఒకేసారిగా బెకబెకమన్నాయి. రావికొమ్మల సందుల్లోనుంచి చూస్తున్న చుక్క నవ్వింది ముసిముసిగా.

మబ్బుల మాటున గురకొయ్యలు నెత్తిమీద కొచ్చాయి – సన్నని తుంపురుల వర్షం కంటిమీదపడి ఆహ్లాదాన్ని కలిగిస్తూ వుంది. అడవి పువ్వుల సువాసన ఏటిదరినుంచే మెల మెల్లగా వీస్తున్నది.

3

సూరి ఊడలమఱ్ఱిచెట్టుకు పదిగజాలు ముందు నుంచున్నాడు. చెట్టు గుబురుగా సందడిగావుంది. అతను చెట్టుదగ్గరకు వచ్చి మొదట్లో రాతిమీద కూర్చున్నాడు. అతని తలలో ఏవో ఆలోచనలు భ్రమిస్తున్నాయి.

యథావిధిగా సాగుతోంది ఆ ప్రదేశపు వాతావరణం.

సూరి లోలోపల గొణుక్కుంటు ఆలోచిస్తున్నాడు. కొన్ని క్షణాలు గడిచాయి.

మఱ్ఱిచెట్టుమీద జిగేలుమని విద్యుత్తులాంటి కాంతి మెరిసింది. మఱ్ఱాకుల ఈనెల నీడలు ఆ వెలుతురుకు భూమిమీద ప్రతిబింబించాయి. సూరి కళ్ళు బైరు క్రమ్మాయి. హృదయం ఒక్క క్షణం సంభ్రమించింది. చెట్టుపైకి చూశాడు తెల్లని ఆకారం కన్పించింది. ఏదో మధురమైన మూని రాగాన్ని అలాపిస్తూవుంది. ఆ రాగాలాపన హృదయ విదారకంగా కొంతసేపు ఉత్సాహభరితంగా కొంతసేపు వినవస్తూ, వుంది. సూరి భ్రమపడిపోతూను. విప్పారిన నేత్రాలతో రెప్పవేయకుండా చూశాడు. గుండె వేగంగా స్పందించడం మొదలుపెట్టింది. ఏదో దిగులులాంటి బాధ. బాధలాంటి అనుభూతి, అనుభూతిలాంటి ఆలోచన మనసులో కదలింది అతను అలానే చూస్తున్నాడు. చిటారికొమ్మమీద వెండిబొమ్మ అంతర్ధానమైంది. సూరి గాభరాపడ్డాడు కలవరపడ్డాడు; బెంబేలుపడ్డాడు; దిక్కులు పరికించాడు. ఇనుపతెర లాంటి చీకటి, తారుకంబళంటి చీకటిలో దృష్టి అనుసరించలేదు.

మఱ్ఱిమాను వెనుకగా పూర్వపు మూనిరాగం. చిరుగాలికి ఆ ఆకారపు సయ్యాట నీటితరంగంలా నిలిస్తూ వుంది. ఆ ఆకారం చెట్టుచుట్టు తిరిగి సూరికి సమీపాన

నిలబడి ఆగిపోయింది. సూరి లేచి నుంచున్నాడు. ఆకారం కదల్లేదు, మెదల్లేదు.

"ఎవరు నువ్వు?" గాద్గదికంగా ప్రశ్నించాడు.

'ఎందుకూ?' సమాధానం. సూరికి అటువంటి మాటే ఎప్పుడో విన్నట్లు జ్ఞాపకానికి వచ్చింది.

'అసలు ఎవరో చెప్పు' గట్టిగా అడిగాడు.

'చెప్పకపోతే...' చిరునవ్వులో జవాబు.

'చంపుతా' అంటూ దగ్గరగా వెళ్ళాడు.

"అలాగే..." ఆకారం అదృశ్యమైంది. సూరికి ముచ్చెమటలు పోశాయి. ఆమాట ఎక్కడో విన్నట్లనిపించింది అతని వెనుక ఆకారం నిలిచింది.

అప్పటినుండి యిప్పటివరకు చంపడమేనా నీపని సూరీ?' అవహేళనను సూచించే కంఠనాదం ధ్వనించింది.

'అమ...లా' పిచ్చిగా. గోముగా అన్నాడు.

'జ్ఞాపకం ఉన్నానా?' జాలిగా అంది.

మెదడులో ఏదో షాక్ లాంటి ప్రవాహం, వీపున ఎవరో చరిచినట్లనిపించింది.

'నీకోసం...నీకోసం...యిలా అయిపోయాను అమలా! నిజంగా...' నిదానంగా మాట్లాడాడు.

'కాదు...ఆవేశంగా చేసినందుకు ఇలా అయ్యావని చెప్తే బాగుంటుంది' అంది వికృతంగా నవ్వుతూ.

'అంతేనంటావా?' అమాయకమైన ప్రశ్న వేశాడు.

'కాకపోయినా...ప్రస్తుతం ప్రమాదం లేదులే' ఖచ్చితంగా అంది కంఠం.

'ఎందుకు అమలా నాపైన ఇంత నిర్దయ. నీకోసం నీ ఇష్టమైన చీరెను తెచ్చానుయిదిగో!' అంటూ చింకిమూట విప్పబోయాడు.

'నే ననుకొన్నా; నువ్వు తెస్తావని' ముక్కుతో నవ్వింది.

'నీ కెలా తెలుసు' ఆదుర్దాగా అన్నాడు.

'ఆఁ...నీ సంగతి నాకు తెలియదూ?' ముసిముసి నవ్వులు ఒలికించిందాకారం.

ఆ నవ్వును చూసి రెప్పవేయకుండా అలానే వుండిపోయాడు. ఒక అలౌకిక స్థితిలోనికి అడుగు పెట్టాడు. మనస్సు ఒక మధురక్షణంకోసం రాగం పాడింది. శరీరపు అవయవాలు సమ్మె చేశాయి

ఎదురుగా మల్లెపువ్వుల్లాంటి పళ్ళతో అమల. పాలరాయి లాగావుంది ఆమె శరీరం, చీరెలోనుండి తొంగిచూస్తున్న ప్రత్యేక సౌందర్యం. శరీరంలో చలిస్తున్న లావణ్యప్రవాహం. ఆచ్ఛాదనం లేనట్లుగా కనబడుతూ గుండెలను గుబగుబలాడిస్తున్న ఉత్తుంగ వక్షోజాలు. తల దిమ్మెక్కిస్తున్న నిశ్చలదృష్టి. అర్థం కాని అధరాలు. నల్లని వెంట్రుకలు. ముద్దుపెట్టుకొంటున్న నున్నని బుగ్గలు.

పిచ్చిసూరి ఉన్మాదుడయ్యాడు. సూరి శరీరం ఉలికింది. వేడెక్కింది. రక్తం ప్రకోపించింది. శరీరం తీయనిబాధతో వణికింది. నరాలు పరాకు పొందాయి. కళ్ళకు చీకటి తెరలు క్రమ్మాయి. దేహాన్ని ఏదో శక్తి సమ్మోహనపర్చింది. అతను గబుక్కున అమల ఆకారాన్ని కౌగలించుకొన్నాడు. ఆమె హృదయం ఘటిగా గుండెను హత్తుకున్నాడు అమల ఆకారం సూరి గాఢ పరిష్వంగంలో లీలమైనట్లనిపించింది. కాని త్రుటిలో అమల ఆకారం సూరికౌగిలిలో లేదు. ఏదో మెత్తని అసహ్యమైన పదార్థం కనబడింది. దానిని దూరంగా విసిరాడు. కొద్దిక్షణాలో నవ్వుతూ ఆకారం ఎదుట ప్రత్యక్షమైంది. ఆమె కళ్ళు నవ్వుతున్నాయి.

సూరి తమాయించుకొన్నాడు. శరీరానికి చెమట పట్టింది అతను ఆకారంపైపు క్షుధాపూరిత నయనాలతో చూశాడు. ఆమె తమాషాగా నవ్వింది.

'సూరీ! నిజంగా నువ్వెందుకు పిచ్చాడిలాగా అయ్యావు?'

'నీకోసం అమలా...నీకోసమే......యిలా గయ్యా.'

'ఓహో! 'నీ' గాని 'మీ' కాదన్నమాట. అవసరమైన వస్తువు ఎదురుగా వున్నపుడు ఆలోచించకుండా తర్వాత అది కనబడకపోతే ఆందోళన చెందుతున్నట్లు కనబడే స్వభావం నీ కొక్కడికే కాదులే! అది సరేగాని మన ప్రథమ పరిచయం ఎలా అయింది? నాకు జ్ఞాపకం లేదు. అందుకని అడుగుతున్నా. ఏమిటో తెలుసుకోవాలని వుంది యిప్పుడు.' సూరి కళ్ళలోకిచూస్తూ అడిగింది.

'ఓ...నాకు జ్ఞాపకం వుంది. ఆ రోజు సాయంత్రం పెనుమూడి దగ్గర ఏరు దాటడానికి నేను, సుదర్శనం వచ్చాం. చివరి పడవ కొద్దిలో దాటిపోయింది. ఆ రాత్రి అక్కడే వుండడానికి నిశ్చయించుకొన్నాం. అప్పుడే నువ్వు, ముసిగా వున్న మీ ముసలమ్మ వచ్చారు. ఆ సంధ్యాసమయంలో చంద్రకాంతిపుగంట చీరెలో వున్న నిన్ను చూశాను, నువ్వు కూడా చూశావు. మన కళ్లు భాషించుకొన్నాయి. ఆ

రాత్రి అక్కడ జాగరం చేశాం. తెల్లవారింది. ఉదయ భానుని తెలిరేఖలు తూర్పున. ఆ రోజు ఎంతో ఆనందంగా వుంది. అప్పుడే మీ ముసలమ్మ చనిపోయింది. నీకేమీ గతిలేదని దీనంగా యేడ్చావు. దిక్కు మొక్కు లేదని వాపోయావు. నేను నీకు అభయమిచ్చాను. కన్నీళ్ళతో నాతో వచ్చేశావు. అదేగా మన మొదటి పరిచయం.' తొలినాటి సంఘటనలు స్మృతిలో మెదిలాయి.

'అవును నిజంగా అదే రోజు ... అవునూ ... మరే ... తొలిరోజులో నా సాహచర్యాన్ని కూర్చి ఏమనుకొనేవాడివి.?'

'ఏముందీ ... నీకనుసన్నల్లో నేను మెలగాలని అనుకొన్నావు. నేనూ ... భరించలేని ఆనందంతో ఉబ్బిబ్బులయ్యాను. అప్పుడే...జీవితం అనే పదానికి అర్థం అవసరమైంది. నా యెడారి జీవితంలో అమృతం వర్షించావు. అగమ్యమైన జీవితానికి ఒక దారితెన్ను కనబడింది. నేను మాత్రం...ఈ ఉపోద్ఘాతం యెందుకు గాని నా జీవితం మారిపోయింది అని అనుకునేవాడిని.' ఒక ప్రక్కకు చూస్తు అన్నాడు.

'ఊఁ... నేనూ కొంతికాలం అయిన తర్వాత అనుకొన్నా నా జీవితం మారిపోయిందని' ఒక దరహాసంలాంటిది వెలువడింది. క్షణంలో మాయమైంది.

'ఇంతకీ...నన్ను బాగా...ప్రేమించావంటావు?'

'ఏం...అనుమానమా?' ఆమె దగ్గరగా వెళ్తూ అన్నాడు.

అమల ఆకారం అతనికి దూరంగా నడుస్తున్నది. కాదు నడుస్తున్నట్లుంది. ఆకారం పాదాలు నేల మీద ఆనడం లేదు. ఆమె గాలిలో నడుస్తుంది. నూరి కూడా నడుస్తున్నాడు.

'ఆహాఁ... లేదు ... ఆఁ... అన్నట్టు ...సుదర్శనం...స్థితి ఎలావుందో?' నూరిని ప్రక్క చూపులు చూస్తు అడిగింది.

నూరి తలలో పిడుగుపడింది. కళ్ళల్లో కారం రేగింది. నిశ్వాసంలో వేడికలిసింది. హృదయంలో విషం ఊరింది.

"నీకనవసరం" తీక్షణంగా చూస్తూ, పౌరుషంగా అన్నాడు.

'పోనీ...మీ విషయంలో' ఆకారం ముఖంలో నవ్వు తొణికిసలాడింది.

'అదే...నీకనవసరం' ప్రతిపదాన్ని నొక్కుతూ అన్నాడు.

'మీ మిత్రుడు కదా ?!' ఆశ్చర్యంలాంటి అవస్థలో అంది.

'ఏం...?... నీకు ... మాత్రం ... కాదా?' ముక్కుపుటాలు ఎక్కువగాలిని తీసుకొంటున్నాయి. కళ్ళు సంకుచించాయి.

'నాకు మిత్రుడేంకర్మ...' అమల ఆకారం ఫకాలున నవ్వింది. తెరలు తెరలుగా నవ్వింది. కవ్వించినట్లు నవ్వింది. హృదయంలో చెయ్యిపెట్టి కెలికినట్లు నవ్వింది.

నూరి రక్తం సముద్రపుపోటులా పొంగింది. కళ్లు మూసుకపోయాయి. గొంతు విప్పారింది. పెదాలు స్పందించాయి.

'అ...మ...లా...' గొంతు మరోకలోకంలో ధ్వనించింది. మూగప్రకృతి రాగంతీసింది. స్వప్న ప్రపంచంలోని ప్రాణులు ఉలిక్కిపడి లేచాయి. రోషంతో ఘోషించాయి. భంగపడిన నిశ్చలప్రకృతి నిశ్వాసంగా పెనుగాలి విడిచింది. ఆకులు రాలుతున్న శబ్దం. ఏటికడుపులో అలలు కదిలిన శబ్దం. ఎండుటాకులు ఫెళఫెళమన్న చప్పుడు.

'అయితే...నిజమేనన్నమాట. వాడు...చెప్పిన మాటలు పచ్చి అబద్ధాలన్నమాట. అబ్బో! ధైర్యంగా చేసిన ఘనకార్యాన్ని వెలడిస్తున్నావా వంచకీ! ఆడజాతికే కళంకం తెచ్చావు...'

'ఎట్లా కళంకం?' నవ్వుతూ అంది.

'ఇంకొకణ్ని వాంఛించడం ఏమవుతుంది?' కసిగా అన్నాడు.

'కామానికి...పరిభాష అవుతుంది. కాకపోతే ...నువ్వు లలితతో ...ఏంచేశావో అదే అవుతుంది... అంతేగా" ముసిముసినవ్వులు నవ్వింది. నవ్వుతుంటే ఆమె రొమ్ములు లేస్తున్నాయి.

అగ్నిపర్వతం ప్రజ్వరిల్లింది. సముద్రం అవధి అధిగమించింది. కళ్ళలో రక్తం కారింది. ఆకాశం విరిగింది. భూమి బ్రద్దలైంది'

'మగవాణ్ణి...ఏమైనా చేసా...కానీ...నిన్ను ...నిన్ను ముక్కలు చేయనందుకు విచారిస్తున్నా. నీ రక్తాన్ని...కళ్ళచూడనందుకు సిగ్గుపడుతున్నా... అబ్బా!...నిన్నేం చేయాలి?' మనిషి చలించిపోయాడు. అమల ఆకారాన్ని పట్టుకోబోయాడు. ఎలా సాధ్యం? ఆకారం నవ్వుమాత్రం ఎగతాళిగా ధ్వనించింది.

'వాడు లేడూ?...సుదర్శనంగాడు. వాడిరక్తం త్రాగాలి; స్నేహాన్నే కలుషితం చేశాడు. వాడి

గుండెకు రంధ్రాలు వేసి, నీముఖం చెక్కి, అవయవాలు చిత్రవధ చేసి, మ్యూజియంలో పెట్టి....'స్నేహానికి ప్రేమకి ప్రతిబింబాలు' అని వ్రాసివుండాల్సింది. భలేగుండేది. బ్రహ్మాండంగా వుండేది...అహ్హాహా... అహ్హాహా...' అంతులేని నవ్వు, అర్థంకాని నవ్వు, అపశ్రుతిలాంటి నవ్వు స్మశానంలో మారుమ్రోగింది.

మసక చుక్కలు మబ్బుముసుగుల్లో దాక్కున్నాయి. వికసించబోతున్న పుష్పం ముకుళించుకొంది. మాతృగర్భంలోనుంచి లోకంలోకి రానున్న శిశువు మరణించింది. ఆలోచనా తంతువు తెగింది. మెరుపుతీగ విరిగింది కన్నీళ్ళకు ఆనకట్ట కట్టబడింది. హృదయం పాషాణకవచం ధరించింది.

సూరి నవ్వుతున్నాడు. అది పిచ్చినవ్వు అనుకొంటే సూరి మంచివాడు మంచివాడు అనుకొంటే పిచ్చినవ్వు. సూరి తూర్పువైపు నడుస్తున్నాడు రాక్షసిబొగ్గులాంటి చీకటిలో మల్లెమొగ్గలాంటి అమల అతన్ని వెంబడిస్తూ వుంది. రావికొమ్మల్లోని చుక్క పిచ్చిగా చూస్తోంది ప్రకృతి మౌనందాల్చింది. మఱ్ఱి చెట్టు దాటారు కొంతదూరం వెళ్ళాక—

'నీకోమాట చెప్పాలని వుంది!' అంది అమల గొంతుక.

సమాధానంగా అనంతమైన నవ్వు. అర్థంకాని నవ్వు. పిచ్చినవ్వు.

'నువ్వు నన్ను ప్రేమించావనన్నావు. మొట్ట మొదటిరోజుల్లో అంతేననుకొన్నా. తర్వాత కామం చావు అని తేలింది. అంతే కాదు; రంగురంగుల పుష్పాల ప్రియుడవనికూడా తెలిసింది. నేను మోహం మొత్తాను. నీలో మార్పు గమనించాను. నేను ప్రకృతికి అతీతురాల్ని కాదు; నా రక్తానికి సమాధానం చెప్పుకోడం నా చేతకాలేదు. నా తృష్ణను ఆర్పుకోలేకపోయాను. నామనస్సును బంధించలేకపోయాను. కాబట్టే సుదర్శనాన్ని వాంఛించాను; కోరాను; కాంక్షించాను. ఇదంతా నువ్వు లేనప్పుడే జరిగింది. కాని...ఏం...జరిగిందో తెలుసా? లోకం అనుకొనేదానికి వ్యతిరేకంగా జరిగింది. ఊహించలేనంత విపరీతంగా జరిగింది. సుదర్శనం...నీ...నిజమైన స్నేహితుడు. హృదయంలో ఆలోచించే మగాడు. నన్ను నిరాకరించాడు. ఆశ్చర్య పడుతున్నావా? నిజంగా...నిరాకరించాడు. కాని...ప్రేమించాడు...సోదరిగా ప్రేమించాడు... సోదరిగా ప్రేమించాడు. చందమామలాంటి మనస్తత్వం గుర్తింపలేక, నిజానిజాలు తెలుసుకోలేక, మనస్సులోతుల్ని గ్రహించలేక లోకం గోడువిని, అమానుషంగా, మూర్ఖంగా, దారుణంగా మమ్మల్ని చంపావు. రత్నాన్ని జారవిడుచుకొన్నావు.' కంఠం ఆగిపోయింది.

రెలుగడ్డి దుబ్బుల్ని పట్టుకొని నీటి నిశ్శబ్దతను, కప్పల అరపులను పరిశీలిస్తూ పెనగులాడుతున్న సూరి చివరివాక్యాన్ని వినగానే స్తంభించిపోయాడు. దిగ్భ్రాంతుడయ్యాడు. మంచు పర్వతంలాంటి కఠిన హృదయానికి అమల మాటల వేడితగిలి కరిగిపోయింది. మనస్సుకు అర్థంకాని కాని సమాధానం స్ఫురించింది. ఆకాశం ప్రశాంతమైంది. రావికొమ్మల్లోని చుక్క హేళనగా చూసింది

సూరి చేతిలోని రెల్లుగడ్డి పట్టు తప్పిపోయింది. తల క్రిందుగా జారిపోయాడు. ధన్‌మని మోత. జామ కొమ్మ విరిగింది గట్టు ప్రవాహాన్నుండి నీటిగర్భం లోనికి సురక్షితంగా వెళ్ళిపోయాడు. వలయాకారంగా నీటి తరంగాలు వ్యాప్తిచెంది అలసి నిద్రపోయాయి.

వికసించిన పుష్పం రాలిపోయింది. ఆలోచనా తంతువు అతుక్కుంది మెరపుతీగ కలిగింది. ఏదో ప్రాణి గోల చేసింది. హృదయం కవచంవిప్పి జల స్నానం చేసింది.

తీతువుపిట్ట వికృతంగా కూసింది.

చుక్క రాలింది.

ఎక్కడో సుదూరంగా కోడికూసింది.

ఒక్కసారి ప్రకృతి ఆహ్లాదంగా కోలాహలం చేసింది.

రాత్రి కాంత కళ్ళు నులుముకొంటానికి ప్రయత్నం చేస్తోంది.

తూర్పు సూర్యుణ్ణి ప్రసవింప బోతుంది.